క్లుప్తంగా

శివాలయం పునర్నిర్మాణానికి రూ.1,44,999 విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న రోమాల శేఖర్

సబ్బవరం: సబ్బవరంలో పునర్నిర్మిస్తున్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయానికి సబ్బవరంలోని గోపాల్‌నగర్‌కు చెందిన రోమాల శేఖర్ రూ.1,44,999 విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు తన నివాసంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు బర్ల రమణ, సింగంపల్లి మోహన్ కృష్ణ, అశోక్ కుమార్, కోరాడ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

సేద్యానికి సాంకేతిక సాయం



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక సహకారంతో రైతులకు మెరుగైన సేవలందించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. తన చాంబర్‌లో శనివారం వ్యవసాయ సలహా మండలి సభ్యులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. జిల్లాలోని 10 ప్రొక్యూర్ సెంటర్లలో ఆరు వేల టన్నులకు గానూ 4,280 టన్నులు ప్రొక్యూర్ చేసినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి రెండో వారంలోగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా రబీలో వేసిన పంటల ఈ క్రాప్ పూర్తి చేయాలన్నారు.ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీపీ ప్రసాద్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి పలు విషయాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ: దలాయిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలిలో ముఖ్యమంత్రి వై ఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సభకు పార్టీ క్యాడర్ తరలింపు గురించి సమావేశంలో చర్చించనున్నారని పేర్కొన్నారు. సమావేశానికి మండలంలో ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోన కోరారు.

పందెం రాయుళ్లకు ఐదు రోజుల జైలు శిక్ష

పరవాడ: దేశపాత్రునిపాలెంలో కోడి పందాలు ఆడుతూ పోలీసులకు పట్టుబడిన నలుగురు వ్యక్తులకు 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ అనకాపల్లి రెండో జూనియర్ అడిషనల్ జడ్జి బి.వి.వి జయలక్ష్మి శనివారం తీర్పు వెలువరించారని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. పట్టుబడిన వంగా ముసిలి నాయుడు, గంగవరపు రాజు, కోడూరు కుంచారావు, జాగార్పు శ్రీనులు కోడి పందాలు ఆడుతూ కత్తులు కలిగి ఉన్నారనే కారణంతో ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. అనంతరం వీరిని అనకాపల్లి సబ్ జైలుకు తరలించినట్టు సీఐ చెప్పారు.

22న జాబ్‌మేళా



హేమసుందర్రావు

పరవాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 22న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.హేమసుందర్రావు తెలిపారు. సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సౌజన్యంతో భారత ప్రభుత్వరంగ సంస్థ(సీఐపీఈటీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ అందిస్తుందని చెప్పారు. సింహాద్రి ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు 10 తరగతి విద్యార్హత,18–35 వయస్సు కలిగిన 30 మందికి విజయవాడలో పాలిమర్స్ టెక్నాలజీలో 6 నెలల పాటు ఉచిత శిక్షణ కల్పించి సర్టిఫికెట్‌తో పాటు విశాఖ, అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్, హోసూర్, చెన్నై ప్రాంతాల్లో ప్లాస్టిక్ అనుబంధ సంస్థల్లో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.3 వేలు స్టైఫండ్, ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హేమసుందర్రావు కోరారు.

పల్లె వికాసం

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- రూపురేఖలు మారిన అమృతపురం



అమృతపురం గ్రామ సచివాలయం



చురుగ్గా సాగుతున్న సీసీ రోడ్లు,డ్రైన్ల నిర్మాణం



పూర్తయిన రైతు భరోసా కేంద్రం

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం సమీపంలో అమృతపురం గ్రామం ఉంది.గ్రామ జనాభా 2,536 మంది వరకూ ఉన్నారు. ఈ పంచాయతీకి చింతగట్ల అగ్రహారం,సూరెడ్డిపాలెం శివారు గ్రామాలుగా ఉన్నాయి. ఇవి వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న గ్రామాలు. ఈ గ్రామం ఉద్యాన పంటల సాగుకు పెట్టింది పేరు. అధిక శాతం రైతులు ప్రకృతి సేద్యం విధానంలో పంటలను సాగుచేస్తూ ఆరోగ్యవంతమైన పంటలను ఉత్పత్తి చేస్తారు. గతంలో గ్రామ ప్రజలు అనేక సమస్యలతో సావాసం చేసేవారు. రోడ్లు,తాగునీరు,విద్యుత్,డ్రైన్లు వంటి సమస్యలతో సతమతమయ్యేవారు. ప్రభుత్వ సేవలు,పథకాల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు,నాయకులు చుట్టూ తిరిగేవారు.

నేడు మారిన స్వరూపం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామం రూపురేఖలు మారిపోయాయి. అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా దూసుకుపోతుంది. మండల కేంద్రాన్ని తలదన్నేలా అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనతో కొత్త కళ సంతరించుకుంది.ప్రజల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాకారం చేశారని ప్రజలు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ ఇంత అభివృద్ధి చూడలేదని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతకు భరోసా

రైతులు గతంలో విత్తనాలు,పురుగులు మందులు, వ్యవసాయ సమాచారం కావాలంటే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. నేడు గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో భరోసా లభించింది.విత్తనాలు, ఎరువులతో పాటు సలహాలు,సూచనలు గ్రామంలోనే అందుతున్నాయి. పంటల బీమా.. ఈ క్రాప్ సకాలంలో జరగడంతో రైతులకు భరోసా లభిస్తోంది.



ప్రారంభానికి సిద్ధంగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

గ్రామ పంచాయతీ - అమృతపురం	
పంచాయతీ జనాభా	2,536
ఓటర్లు	2,005
శివారు గ్రామాలు	చింతగట్ల అగ్రహారం, సూరెడ్డిపాలెం
అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు	రూ.2.97 కోట్లు
అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కింద	రూ.25.02 కోట్లు

చేపట్టిన పనులు.. ఖర్చు చేసిన నిధుల వివరాలు	
గ్రామ సచివాలయం అదనపు అంతస్తు	రూ. 25 లక్షలు
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్	రూ.20.08 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.23.94 లక్షలు
సీసీ రోడ్లు,డ్రైన్లు	రూ.83.07 లక్షలు
అంగన్‌వాడీ కేంద్రం	రూ.6 లక్షలు
వాటర్ ప్లాంట్ నిర్మాణం	రూ.3 లక్షలు
కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్ నిర్మాణం	రూ.3 లక్షలు
నాడు–నేడు పాఠశాల ఆధునికీకరణ	రూ.4.51 లక్షలు
జలజీవన్ మిషన్ కిందట ఇంటింటి తాగునీటి కుళాయిల ఏర్పాటు	రూ.65.80 లక్షలు

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల రూపురేఖలు మారిపోయాయి.కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల కల్పించడంతో మా గ్రామం సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది.ప్రభుత్వ సేవలు,సమాచారం తెలుసుకోవాలన్నా గతంలో మండల కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజల తీవ్ర ఇబ్బందులు పడేవారు.ఈ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో ప్రజలకు భరోసా వచ్చింది.గ్రామంలో మినీ మండల సముదాయాన్ని నిర్మించారు.

–బైలపూడి గౌరి, సర్పంచ్,అమృతపురం

బాధలు తప్పాయి



ప్రభుత్వ పథకాలు,సేవల కోసం గతంలో మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందుతున్నాయి.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వివక్షకు తావులేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుంది.ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్లు వారి చెంతకే వెళ్లి సేవలు అందిస్తున్నారు.

–నవీన్, అమృతపురం

రహదారి భద్రతపై అవగాహన అవసరం

సీఐ బాలసూర్యారావు

పరవాడ: రహదారి భద్రత పై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సీఐ ఎస్. బాలసూర్యారావు సూచించారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో శనివారం రహదారి భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, చరవాణి మాట్లాడడం మంచిది కాదన్నారు. కార్లలో ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలన్నారు. నిబంధనలను అనుసరించి నిర్దేశించిన వేగంతో వాహనాలను నడపాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులతో మర్యాదపూర్వకంగా మసులుకోవాలని కోరారు. రహదారి భద్రతను పాటిస్తామని కార్మికులు, ఉద్యోగులతో సీఐ బాలసూర్యారావు ప్రతిజ్ఞ చేయించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ బాలసూర్యారావు

4న విప్రోత్సవం

సింహాచలం: వచ్చేనెల 4న విశాఖ నగరంలో జరిగే విప్రోత్సవాన్ని విజయవంతం చేయాలని పలువురు బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు కోరారు. 98వవార్డు అడవివరంలోని ప్రైవేటు కల్యాణమండపంలో గోపాలపట్నం నుంచి సింహాచలం, వేపగుంట నుంచి గోశాల ప్రాంతాల బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. బ్రాహ్మణుల ఐక్యత కోసం ఫిబ్రవరి 4న జరిగే విప్రోత్సవంలో యావత్ బ్రాహ్మణులంతా తరలిరావాలని ప్రతిజ్ఞ చేశారు. బ్రాహ్మణుల ఉనికిని కాపాడుకునేందుకు నిర్వహిస్తున్న విప్రోత్సవంలో సంఘటితంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పూడిపెద్ది శర్మ, కావురి చరణ్, వంగూరి గణేష్, నరసింహమూర్తి, డీఎస్ఎస్ సాయిరామ్, గార్లపాటి నారాయణరావు, రవికిరణ్, మంథా కాశిబాబు, రామభద్రుడు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

రైతులకు గుర్తింపు కార్డుల అందజేత

పెందుర్తి: పెందుర్తి రైతు బజారులోని రైతులకు గుర్తింపు కార్డులను శనివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్టాల్స్, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఈవో వి.షర్మిల, బజార్ సహాయకుడు ఎం.చిన్నబ్బాయి పాల్గొన్నారు.



రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న షేక్ యాసిన్

కబడ్డీ పోటీల విజేత 'పెద ముషిడివాడ'



నువ్వా నేనా అనేలా తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

- మహిళల విభాగంలో తానాం–1 జట్టు విజయం
- ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలు



విజేత పెదముషిడివాడ జట్టుతో నిర్వాహకులు



హోరాహోరీగా తలపడుతున్న మహిళా కబడ్డీ జట్లు

అగనంపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శనివారం కబడ్డీ పోటీలతో ముగిశాయి. పురుషులు, మహిళల విభాగాల్లో పరవాడ మండలంలోని గ్రామ సచివాలయ జట్ల మధ్య నిర్వహించిన కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు పోటా పోటీగా తలపడ్డారు. పురుషుల విభాగంలో గొర్లెవానిపాలెం జట్లపై పెదముషిడివాడ, మహిళల విభాగంలో గొర్లెవానిపాలెం జట్లపై తానాం–1 జట్టు విజయం సాధించి నియోజకవర్గ పోటీలకు ఎంపిక అయ్యాయి. కార్యక్రమంలో పాల్గొన్న పరవాడ మండలాభివృద్ధి అధికారి కార్యాల పరిపాలనాధికారి రాంబాబు, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఆడుదాం ఆంధ్రా పరవాడ మండల కో–ఆర్డినేటర్ లోవరాజు, గ్రౌండ్ ఇన్‌చార్జి ప్రసన్న కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.అన్నాజీ రావు, తులసీ సత్యవతి, ఎస్.వి.రమణ, లక్ష్మీ రాణీ, శ్రీదేవి, దేవి, అమ్మాజీ, నాయుడుబాబు, వివిధ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుష్కరిణిని అభివృద్ధి చేయాలని వినతి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణిని అభివృద్ధి చేయాలని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈమేరకు శనివారం దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. పవిత్రమైన వరాహ పుష్కరిణిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఉద్యానవనంగా మార్పు చేయాలని కోరారు. ఈ అంశాన్ని ధర్మకర్తల మండలి సమావేశం అజెండాలో పెట్టాలన్నారు.

సింహాచలేశుడిని దర్శించుకున్న ముత్తంశెట్టి



ఆశీర్వచనం స్వీకరిస్తున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదదేవి సన్నిలోహారతి అందజేశారు.

వీసీ ప్రసాదరెడ్డికి అభినందన



వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: ఆంధ్ర యూనివర్సిటీ వీసీగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డిని శనివారం 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కలిసి అభినందించారు. ఏయూ అభివృద్ధికి ప్రసాదరెడ్డి చేసిన సేవలు అభినందనీయమన్నారు.

సింహగిరిపై స్వచ్ఛ తీర్థ



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయాల్లో ఈనెల 14 నుంచి 21వరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్నకు తోమాల సేవ



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ చేసి అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ జరిగాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కమనీయం.. నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న కాశీ అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం కాశీలోని కాశీ విశ్వనాథ ఆలయ ప్రధాన అర్చకుడు ఓం ప్రకాష్ మిశ్రా, అర్చకులు డాక్టర్ థక్ నారాయణ్, చిల్లా అన్నపూర్ణ ప్రసాద్, చిల్లా జయరామ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, ఏఈ హరి తదితరులు పాల్గొన్నారు.



ఓం ప్రకాష్ మిశ్రాకు ప్రసాదం అందజేస్తున్న శ్రీనుబాబు, అర్చకులు

నేడు శ్రీరామ శోభాయాత్ర

సింహాచలం: అయోధ్యలోని రామజన్మభూమి ఆలయంలో బాలరాముని విగ్రహం ప్రతిష్ఠ పురస్కరించుకుని ఆదివారం 93వ వార్డు పరిధి మోదీవీధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ శోభా యాత్ర నిర్వహిస్తున్నట్టు మోదీ వీధి సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం మోదీ వీధి సంక్షేమ సంఘం ప్రతినిధులు, నివాసితులు జై శ్రీరామ్ అంటూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని సంఘీభావంగా ఆదివారం విరాట్‌నగర్‌లోని ఆర్టీసీ డిపో నుంచి సింహచలం గోశాల వరకు శ్రీ రామ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



జై శ్రీరామ్ అంటూ పాదయాత్ర చేస్తున్న మోదీ వీధి నివాసితులు

లారీ క్లీనర్ అనుమానాస్పద మృతి

పరవాడ: స్థానిక ఇండస్ట్రియల్ పార్క్‌లో లారీ క్లీనర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతడు కృష్ణా జిల్లా మోపర్రు గ్రామానికి చెందిన పిల్లా నాగేశ్వరరావు(65)గా గుర్తించారు. దీనికి సంబంధించి పరవాడ ఎస్ఐ తేజేశ్వరరావు అందించిన వివరాలు... లారీ డ్రైవర్ కట్ట శివ నారాయణ, క్లీనర్ నాగేశ్వరరావు ఐరన్ లోడు కోసం ఈ నెల 18న సాయంత్రం 6 గంటలకు ఇండస్ట్రియల్ పార్క్‌లోని బీకే స్టీల్ పరిశ్రమ వద్ద లారీని ఉంచారు. రాత్రి 10 గంటల సమయంలో క్లీనర్ నాగేశ్వరరావు మంచి నీటి కోసం సెక్యూరిటీ గేట్ వద్దకు వెళ్లి అక్కడ కింద పడిపోయాడు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్ శివ నారాయణ కలిసి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు జరిపిన వైద్యులు నాగేశ్వరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. డ్రైవర్ శివ నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పరవాడ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.